క్లుప్తంగా

పాదయాత్రకు తరలిన నాయకులు

కేటీదొడ్డి: అలంపూర్ నుంచి చేపట్టిన మాదిగల విశ్వరూప పాదయాత్రకు మండలంలోని ఉమిత్యాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. పాదయాత్ర 13వ రోజున ఎల్బీనగర్ నియోజకవర్గ రోషన్ దౌలా బస్తీలో ముగింపు కార్యక్రమానికి హాజరై సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా లక్ష్మన్న

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గ ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మండలంలోని మద్దూరు వాసి కోస్గి లక్ష్మన్నను అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ హైదరాబాద్‌లో ప్రకటించినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆశీర్వదించాలని ఆయన కోరారు.

అభివృద్ధికి అహర్నిశలు కృషి



ఆత్మకూర్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని.. మరోసారి ఓట్ల రూపంలో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ కోరారు. శుక్రవారం స్థానిక సాయితిరుమల ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల వేళ అబద్ధపు హామీలతో కాంగ్రెస్, మత విద్వేషాలతో రెచ్చగొట్టేందుకు బీజేపీ నాయకులు వస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు ఇక్కడ ఎలా అమలు చేస్తారో చెప్పాలంటూ నిలదీయాలని సూచించారు. బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలో బీడువారిన లక్షల ఎకరాలు నేడు సాగులోకి వచ్చాయని.. రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్, రూ.లక్ష రుణమాఫీ, పంటకు గిట్టుబాటు ధరతో రైతులు రాజుల్లా బతుకుతున్నారని వివరించారు. వచ్చేనెల ఆరోతేదీన మక్తల్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని.. బీఆర్‌ఎస్ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి చిట్టెం సుచరిత, పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారు శ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు శివరంజని, వింగ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, రైతుసంఘం అధ్యక్షుడు విరేష లింగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా మట్టిసేకరణ



నారాయణపేట రూరల్: దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధుల ఇంటినుంచి సేకరించిన మట్టితో ఢిల్లీలో నిర్మిస్తున్న స్మారక స్తూపం పవిత్రమైన కార్యమని పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఎస్‌పీఎం నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మక్తల్, అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో నాలుగు కళశాల్లో సేకరించిన మట్టిని శుక్రవారం ఢిల్లీకి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మధు, ఉమాకాంత్, ఫక్రొద్దీన్, మహిపాల్, బీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత లేదు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత కేటీఆర్, ఇతర బీఆర్‌ఎస్ నాయకులకు లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఇస్తే పార్టీని విలీనం చేస్తానని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుంబపాలనకు పరిమితమయ్యారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్‌గాంధీది అని గుర్తుచేశారు. ఆ కుటుంబం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అజ్మత్‌అలీ, రాములుయాదవ్, షహిం, ఫక్రు తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



గట్టులో కుంకుమార్చన సేవలో పాల్గొన్న మహిళలు



రాజోళిలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



ఉండవెల్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అయిజ: మండల కేంద్రంలోని కాళికాదేవి, వాసవి కన్యకా పరమేశ్వరి, అంబభవాని ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పట్టణ సమీపంలోని కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయంలో పూజలు చేశారు. భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఊరేగించారు.

ధరూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కలశపూజ, కుంకుమార్చన, గణపతి పూజ నిర్వహించారు.

రాజోళి: చదువుల తల్లి సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సరస్వతీదేవిగా దర్శమిచ్చారు. మహిళలు తమ పిల్లలను అమ్మవారి ఆలయాలకు తీసుకువచ్చి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అర్చకులు మహిళలతో కుంకుమార్చనలు చేయించారు. శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గట్టు: దేవీ నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని భవానిమాత భక్తులకు సరస్వతి దేవీగా దర్శనమిచ్చారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సరస్వతీదేవీ అలంకరణలో భాగంగా ఎస్ఎస్‌కే సమాజ్ వారు అమ్మవారికి వీణను తయారు చేయించి అలంకరించారు. మహిళలు ఆలయంలో కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. గట్టులోని కొట్లగేరి కాళికాదేవీ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అనసూయమ్మ కాలనీలో ప్రతిష్ఠించిన అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చింది. మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో, గాంధీనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



అయిజలో కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మిగా..



ధరూరులో సరస్వతీదేవిగా..



మల్దకల్‌లో సరస్వతీదేవి అలంకరణలో..



గట్టులో సరస్వతీదేవిగా భవాని మాత



అయిజలో అంబభవాని ఆలయంలో..

రైతు రాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యం



దోర్నాలలో మాట్లాడుతున్న బండ్ల జ్యోతి

ధరూరు: రైతు రాజ్యం కేసీఆర్‌తో సాధ్యమని బండ్ల జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని అల్వలపాడు, గుర్రోనిపల్లి, దోర్నాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రైతులకు అన్ని విధాలా పథకాలను వర్తింపజేసి రైతును రాజు చేసేందుకు కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని తెలిపారు. కరెంటు గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. కర్ణాటకలో గెలిచి ఆరు నెలలు గడిచినా నేటికీ ఆ ఆరు పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు. నవంబరు 30న జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మహబూబ్, నాయకులు విజయ్‌కుమార్, సర్వారెడ్డి, పురుషోత్తంరెడ్డి, సంజీవ్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

గట్టు: బీఆర్‌ఎస్‌ను మారో మారు ఆదరించాలని ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. శుక్రవారం ఆలూరులో ఇంటింటా కృష్ణన్న కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేగా కృష్ణమోహన్‌రెడ్డిని మారోమారు గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాముశెట్టి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అంగడి బస్వరాజు, తిమ్మప్ప, రామునాయుడు, బజారి, వీరేష్, రామకృష్ణ, సంతోష్, ప్రాణేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న సువాసిని కుమారి పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవారాత్రి బ్రహ్మోత్సవాలలో సువాసిని, కుమారి పూజలు విశేషంగా నిలిచాయి. ప్రతిరోజు ముత్తయిదువులకు అలిగే చిన్నారులకు అమ్మవారి దివ్యరూపంగా భావిస్తూ వారికి ప్రత్యక్షంగా శోడషోపచార పూజలు నిర్వహిస్తు అమ్మవారి ప్రసాదాలను అందజేస్తున్నారు. శుక్రవారం ఈ పూజకు హైదరాబాద్‌కు చెందిన శైలజా దేవికి భాగ్యం దక్కింది. ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులలో ఎవరికి ఈ అవకాశం దక్కుతుందా అని భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులకు శుక్రవారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్, ఆలిండియా స్టైల్ చీఫ్ అబ్దుల్ నబీ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. బాలికల విభాగంలో అనిరిత, యోగేశ్వరి గ్రీన్ బెల్ట్ సాధించడంతో పాటు డబుల్ ప్రమోషన్ సాధించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్స్ హరీష్‌యాదవ్, జాఫర్ సాధిక్, మంజునాథ్, ఇంతియాజ్, జహంగీర్, కురుమూర్తి, శివరాజ్, పవన్‌తేజ్, జశ్వంత్‌చారి, కార్తికేయ, అంజి పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నాయకుల వికృత చేష్టలు మరువకండి



చిన్నోనిపల్లెలో మాట్లాడుతున్న సరిత

గట్టు: పదేళ్ల కాలంలో గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వికృత చేష్టలను ప్రజలు మరవకూడదని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పిలుపునిచ్చారు. తిరగబడుదాం–తరిమి కొడదాం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి చిన్నోనిపల్లె, అంతంపల్లిలో పర్యటించారు. బహుజన బిడ్డకుగా కాంగ్రెస్ పార్టీ తరపున మీ ముందుకు వస్తున్నానని, ప్రజలు ఓట్లు వేసి ఆదరించాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి తాను అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అధికార పార్టీ నాయకులు ఎన్నికలు రావడంతో ఇంటింటా తిరుగుతున్నారని, దళిత బంధు, గృహలక్ష్మి, బీసీ, మైనార్టీలకు ఆర్థికసాయం వంటివి ఎవరికిచ్చారో గుర్తుపెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పల్లెల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం



జూలెకల్‌లో రోడ్డుపైనే పారబోసిన చెత్త

- ఈగలు, దోమలకు నిలయాలుగా మారిన వైనం
- రోగాల బారిన ప్రజలు

శాంతినగర్: పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించడంతో ఈగలు, దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఓ వైపు డ్రెయినేజీలు సరిగాలేక మరోవైపు సీసీరోడ్లు, అంతర్గత రహదారులపై నిలిచిన నీటితో దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు సరిగా చేపట్టకపోవడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇతర పనులపై దృష్టిసారించడం, పారిశుద్ధ్య సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్యం అటకెక్కింది.

ఇంకుడు గుంతలపై నిర్లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో వృథాగా పోయే నీరు భూమిలో ఇంకిపోయి అటు భూగర్భజలాల పెరుగుదలకు, ఇటు పరిశుభ్రతకు పాటుపడాలని పంచాయతి కార్యదర్శులకు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఇవేమి తమకు పట్టవంటూ రోడ్లపై మురుగు పారుతున్నా చూసి చూడనట్లు వెళ్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి సారించి గ్రామాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో వేసిన సీసీ రోడ్లను మిషన్‌భగీరథ పైపులైన్‌ల కోసం పగలగొట్టారు. దీంతో రోడ్లు పాడై మురుగు రోడ్లపై నిలుస్తూ సమస్య తలెత్తుతోందని ప్రజలు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులను హెచ్చరిస్తూనే ఉన్నాం. పారిశుద్ధ్యం లోపించిన గ్రామాలను గుర్తించి కార్యదర్శులకు నోటీసులు పంపుతాం. సిబ్బంది, కార్యదర్శుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం.

– రవీంద్ర, ఎంపీడీఓ, వడ్డేపల్లి

చెత్త తీయడంలేదు



గ్రామంలోని ఆయా కాలనీల్లో చెత్త పేరుకుపోయింది. పంచాయతీ సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. దుర్వాసన వస్తుంది. నిత్యం చెత్తను ట్రాక్టర్‌పై తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్‌యాదవ్, జూలెకల్, వడ్డేపల్లి మండలం

పందుల స్వైరవిహారం



కాలనీల్లోని చెత్తను తీసుకువెళ్లకపోవడంతో చెత్తను రోడ్ల సమీపంలో వేస్తున్నారు. పందులు చెత్తను చిందరవందర చేస్తూ కాలనీలను అపరిశుభ్రం చేస్తున్నాయి. చెత్తబుట్ట సమీపంలోని ఇళ్లలో ఉండలేకపోతున్నాం. దోమల బెడద ఎక్కువై విష జ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి గ్రామంలో వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.

– ఆంజనేయులు, జూలెకల్, వడ్డేపల్లి మండలం

విద్యార్థుల వివరాలు నమోదు చేయండి



మానవపాడులో వివరాలను తెలుసుకుంటున్న డీఈఓ సిరాజుద్దీన్

మానవపాడు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల వివరాలను సమగ్ర శిక్ష ఆన్‌లైన్ అడ్మిషన్ నందు నమోదు చేయాలని డీఈఓ సిరాజుద్దీన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆన్‌లైన్ అడ్మిషన్ ఎంత వరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాల సమగ్ర శిక్ష ఆన్‌లైన్ అడ్మిసన్ తప్పక నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంఎస్ కోఆర్డినేటర్ వీరేష్‌గౌడ్, శ్రావణి, సీసీఓ మెహరున్నిసాబేగం, శశిధర్, శాంతిరాజ్ పాల్గొన్నారు.

సరిహద్దులపై పోలీసుల ఫోకస్



నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెక్‌పోస్ట్ సీఐ ఖలీద్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు, బంగారం తీసుకెళ్లేవారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు, బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, జగదీష్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు దసరా ఆఫర్స్

లక్కీ డ్రా ద్వారా రూ.11లక్షల బహుమతులు



గద్వాల బస్టాండ్‌లో డ్రా బాక్స్‌లో టికెట్ వేస్తున్న ప్రయాణికుడు

గద్వాల క్రైం: జిల్లా ప్రయాణికులు బస్సు సర్వీసులలో ప్రయాణం చేసిన సమయంలో టికెట్ వెనుక ఫోన్ నంబర్ జత చేసి డ్రా బాక్స్‌లో వేస్తే చాలు లక్కీ డ్రా ద్వారా గెలుపొందిన ప్రయాణికులకు రూ.11 లక్షల విలువ గల బహుమతులు అందించేందుకు పండుగ ఆఫర్‌ను ఆర్టీసీ ప్రకటించింది. ఈ నెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసిన వారికి ఈ ఆఫర్ వర్తిస్తుంది.

సొంతూళ్లకు పయనం

పండుగ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో జిల్లా నలుమూల నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. బస్సు ప్రయాణం చేస్తున్న వారికి పండుగ ఓ మంచి జ్ఞాపకంగా ఉండాలనే లక్ష్యంతో లక్కీ డ్రా తీసుకువచ్చారు. ఇప్పటికే సొంతూర్లకు వెళ్లే ప్రయాణికులకు ముందుస్తు టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీని ప్రకటించారు. గద్వాల నుంచి తిరుపతి, కర్నూల్, మంత్రాలయం, కర్ణాటక, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలు, జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లెలకు బస్సు సర్వీసులు ఉన్నాయి. సాధారణ రోజుల్లో గద్వాల ఆర్టీసీకి రూ.14 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. ఈ దసర పండుగ సందర్భంగా రోజుకు రూ.16లక్షల మేరా ఆదాయం సమాకురుతుంది.

సంస్థ అభ్యున్నతి కోసం..



సంస్థ అభ్యున్నతి కోసం ఆర్టీసీ యాజమాన్యం చేపట్టిన వినూత్న కార్యక్రమం. ఇప్పటికే రాఖీ పండుగ సమయంలో ప్రత్యేక రాయితీ అందించాం. దసర పండుగా సందర్భంగా 10 శాతం రాయితీతో పాటు రూ.11 లక్షల బహుమతులను అందించాలనే లక్ష్యంతో లక్కీ డ్రాను ఏర్పాటు చేశాం. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఉంటుంది. ప్రయాణికులు టికెట్ తీసుకున్న తర్వాత వెనుక వారి ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రా బాక్స్‌లో వేయాలి. డ్రా తేదీని త్వరలో ప్రకటిస్తాం.

– మంజులారెడ్డి, డిపో మేనేజర్, గద్వాల

బెటాలియన్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



మాట్లాడుతున్న కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేసి ఊరేగింపుగా సాయిద చైతన్య పాఠశాల ఆవరణంలోకి తీసుకువచ్చారు. అనంతరం బతుకమ్మలను గౌరవిస్తూ పాటలు పాడుతూ మహిళలు, చిన్నారులు బొడ్డెమ్మలు వేశారు. కార్యక్రమానికి కమాండెంట్ సాంబయ్య హాజరై మాట్లాడారు. ఈ ఏట పాడి పంటలు బాగా పండి రైతులకు అధిక లాభాలు రావాలని కోరుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు. చివరగా సిబ్బందికి, కుటుంబ సభ్యులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషనం, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, గోపాల్, రాజారావు, రాజు, సిబ్బంది ఉన్నారు.

నత్తనడకన డైనింగ్ హాల్ నిర్మాణం



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మిస్తున్న డైనింగ్ హాల్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మన ఊరు–మన బడి నిధుల ద్వార పాఠశాలకు మంజూరైన నిధుల్లో భాగంగా ముందస్తుగా డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టాలని భావించిన అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌తో డైనింగ్ హాల్ పనులను మూడు నెలల కిందట ప్రారంభించారు. దసరా సెలవుల నాటికి పనులు పూర్తవుతుందని భావించినా.. నత్తనడకన పనులు కొనసాగుతుండటంతో విద్యా సంవత్సరం ముగిసే నాటికైన పూర్తవుతుందో లేదో అన్న సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.